క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, మార్పుచేర్పులు, ఆధార్ అప్‌డేషన్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

పొదిలి విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రబ్బానీ ముస్కాన్

పొదిలి రూరల్: స్థానిక వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థిని, మసీద్‌తోటకు చెందిన షేక్ రబ్బానీ ముస్కాన్ షైనింగ్ స్టార్ అవార్డు అందుకుంది. ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 1000 మార్కులకు గాను 988 సాధించి రాష్ట్ర స్థాయిలో 4వ స్థానంలో నిలిచిన రబ్బానీ ముస్కాన్‌కు సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

కొమరోలు: మండలంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికయ్యారు. మండలంలోని ఎస్‌బీఎన్‌ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు షేక్ తహసిన్, బి.వసంతకుమార్, కె.శరణ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముత్తుముల జ్యోత్స్నవి, సర్వైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన కె.హర్షితకు సోమవారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారీయా చేతులమీదుగా అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలల యాజమాన్యాలు, స్థానికులు అభినందించారు.

గురుకులాల్లో సీట్లు ఖరారు చేసుకోవాలి

మార్కాపురం: ఇటీవల 5వ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన వారు రాయవరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సీట్లు ఖరారు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టీపీ ఆశాలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరిచిన వారి ఎంపిక ప్రక్రియ జరుగుతోందని, విద్యార్థుల మొబైల్ ఫోన్లకు మేసేజ్ వచ్చిన వెంటనే లేదా సదరు కళాశాల నుంచి ఫోన్ రాగానే మీ సీట్లను ఖరారు చేసుకోవాలని స్పష్టం చేశారు.

తహసీల్దార్‌ను సన్మానించిన రెవెన్యూ సిబ్బంది



అర్ధవీడు: మండల తహసీల్దార్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన చిలకల నాగార్జునరెడ్డిని సోమవారం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న నాగర్జున రెడ్డి డిప్యుటేషన్‌పై అర్ధవీడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, మండల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి



బేస్తవారిపేటలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: యోగాంధ్ర కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రాల్లో సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆరోగ్యానికి యోగాసనాల అభ్యసన ఎంత ముఖ్యమో అధికారులు వివరించారు. యోగాతో సంపూర్ణ మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. పలుచోట్ల మానవహారంగా ఏర్పడి ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. మార్కాపురంలో సబ్ కలెక్టర్ సహదిత్ వెంటక త్రివినాగ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాగ్యవతి, తహసీల్దార్ చిరంజీవి, బేస్తవారిపేటలో ఎంపీడీఓ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, కంభంలో ఎంపీడీఓ వీరభద్రాచారి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, గిద్దలూరులో తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ బి.జ్యోతి, కొనకనమిట్లలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, తహసీల్దార్ సురేష్, డాక్టర్ ఎస్పీ బాలయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



గొట్లగట్టు బస్‌షెల్టర్ దుస్థితి



షెల్టర్‌లో ఖాళీ మద్యం సీసాలు

అస్తవ్యస్తంగా బస్ షెల్టర్లు

- లక్షల రూపాయలు ప్రభుత్వ ధనం వృథా
- శిథిలావస్థకు చేరుకున్న తాటిచెర్ల మోటు బస్ షెల్టర్
- గొట్లగట్టులో మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

కొనకనమిట్ల/కొమరోలు: ప్రయాణికుల సౌకర్యార్థం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. కొనకనమిట్లలో మండలంలోని మేజర్ పంచాయతీ గొట్లగట్టు బస్టాండ్ సెంటర్లో ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ నేడు అస్తవ్యస్తంగా మారింది. పట్టపగలే మందుబాబులు బస్ షెల్టర్‌లో మద్యం తాగి ఖాళీ గ్లాసులు, సీసాలు అక్కడే వదిలి వెళ్తుండటంతో దుర్వాసన వస్తోంది. కనీసం కూర్చోవడానికి వీల్లేకుండా పోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా షెల్టర్‌కు అడ్డుగా నిత్యం ఆటోలు నిలుపుతుండటం, కొందరు చిరువ్యాపారులు తోపుడు బండ్లు అక్కడే పెట్టి వ్యాపారం చేసుకుంటుండటంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది.



కొమరోలు : నిరుపయోగంగా ఉన్న గుండ్రెడ్డిపల్లె బస్‌షెల్టర్

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటు, గుండ్రెడ్డిపల్లె, దద్దవాడ, పామూరుపల్లి గ్రామాల వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి బస్‌షెల్టర్లను నిర్మించారు. వీటి నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆ ఛాయలకు వెళ్లకుండా రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. నిర్వహణా లోపం కారణంగా బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గుండ్రెడ్డిపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రెండు బస్‌షెల్టర్లు నిర్మించారు. ఊరికి దూరంగా ఉండటంతో వాటిని ఎవరూ వినియోగించడం లేదు. రాత్రి సమయంలో బస్‌షెల్టర్లలో మందుబాబులు మద్యం తాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తాటిచెర్ల మోటు జంక్షన్‌లో దశాబ్ద కాలంగా బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంది. అక్కడ ప్రయాణికులు కూర్చోవడానికి అసౌకర్యంగా ఉండడంతో ఎవరూ వెళ్లడం లేదు. ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండటంతోపాటు పిచ్చి మొక్కలు మొలిచాయి. సంబంధిత అధికారులు స్పందించి బస్‌షెల్టర్లను వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



కూర్చునేందుకు అవకాశం లేక బస్ షెల్టర్ ముందు నిల్చున్న ప్రయాణికులు



కొమరోలు : తాటిచెర్లమోటు జంక్షన్ వద్ద శిథిలావస్థకు చేరి మొక్కలు మొలిచిన బస్‌షెల్టర్

పొగాకు రైతులను పట్టించుకోని

కూటమి ప్రభుత్వం



హెలిప్యాడ్ వద్ద జగనన్న పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, అన్నా రాంబాబు

- జగనన్న పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, బత్తుల బ్రహ్మానందరెడ్డి

పొదిలి రూరల్: కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం పొగాకు రైతులపై చిన్నచూపుతో పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ముందుగా దర్శి రోడ్డులోని ఎస్ఎస్‌ఆర్ పెట్రోల్ బంకు వద్ద వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద సోమవారం వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబుతో కలిసి జగనన్న పోరుబాట పోస్టరును ఆవిష్కరించారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు ఈ నెల 11న ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పొదిలికి వస్తున్నారని చెప్పారు. పొగాకు బోర్డులో జగన్‌మోహన్‌రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని, వారికి భరోసా కల్పిస్తారన్నారు. జగన్‌ని కలిసి బాధలు చెప్పుకోవడానికి రైతులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులపై చిన్నచూపు చూడటం తప్పా ఏఒక్కరికీ కనీస సహాయం చేయలేదన్నారు. అన్నదాతలు పండించిన కంది, వరి, మిరప పంటలకు సరైన ధరలేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పొగాకు రైతుకు గత నాలుగేళ్లతో పోల్చుకుంటే ఈ సంవత్సరం బ్యారన్, పొలం కౌలు, పెట్టుబడి బాగా పెరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ధరలను చూస్తే రైతులకు దిక్కు తోచడం లేదన్నారు. ఎక్కడ చూసినా పొగాకు బేళ్లు అమ్ముడుపోక, పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో వచ్చిన ధరలు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల కోసం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతులు కష్టాలు పడుతున్నా ఈ ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడినట్లు ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి రైతులకు మేలు చేయాలని కోరారు. రైతులకు కనీస మద్దతు ధర వచ్చే వరకు వైఎస్సార్ సీపీ వారికి అండగా నిలిచి ప్రభుత్వంపై రైతుల పక్షాన పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జీ శ్రీనివాసులు, సాయి రాజేశ్వరరావు, గుజ్జులంజీవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వై వెంకటేశ్వరరావు, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పోరుబాటకు రైతులు తరలిరావాలి



రేగడపల్లిలో నాయకుల ప్రచారం

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న పొదిలి పట్టణంలో పొగాకు వేలం కేంద్రం పర్యటనకు రైతులంతా హాజరై విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆ పార్టీ నాయకులు పలు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని రేగడపల్లి, గొట్లగట్టు, నాగిరెడ్డిపల్లి, పాతపాడు, నాగంపల్లి, వింజవర్తిపాడు, చినారికట్ల గ్రామాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉడుముల గురవారెడ్డి పర్యటించారు. జగనన్న పోరుబాట కార్యక్రమానికి రైతులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం దిగివచ్చి రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు కల్పించేలా డిమాండ్ చేసేందుకు అన్ని గ్రామాల నుంచి రైతులంతా కదలి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్‌డీటీ సంస్థను కొనసాగించాలి

మార్కాపురం టౌన్: చెంచు గిరిజనులకు విశిష్ట సేవలు అందిస్తున్న ఆర్‌డీటీ సంస్థను కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దగ్గుబాటి సోమయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజనులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌డీటీ సంస్థను కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. 2 దశాబ్దాలకు పైగా ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో నివసిస్తున్న చెంచు గిరిజనులకు అనేక విధాలుగా వసతి సౌకర్యాలు, వైద్యం, నివాస గృహాలు, విద్య సౌకర్యాలు కల్పిస్తున్నారని, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారన్నారు. ఆర్‌డీటీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తోందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు ఆశించకుండా దాతల సహకారంతో సేవలు కొనసాగిస్తోందన్నారు. ఆర్‌డీటీ సంస్థ కార్యకలాపాలను ఈ ఏడాది నుంచి నిలిపివేస్తూ సంస్థ అకౌంట్స్, రెన్యువల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఇలా చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం తహసీల్దార్ చిరంజీవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కుడుముల తిరుపతయ్య, వెంకటేష్, అంజయ్య, మండ్ల తిరుపతయ్య, రాజయ్య, నాగమ్మ, తిరుపతమ్మ, బయ్యమ్మ, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న చెంచు గిరిజనులు

మూడు రోజులపాటు సాగర్ నీరు బంద్

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణానికి దూపాడు నుంచి సరఫరా చేస్తున్న డీఐ పైపులైను మరమ్మతుల కారణంగా మూడు రోజులపాటు నీటి సరఫరా నిలిపేస్తున్నట్లు కమిషనర్ నారాయణరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు సాగర్ నీటి సరఫరా ఉండదని, ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కమిషనర్ సూచించారు.

వెలగని వీధిలైట్లు



రాజానగర్‌లో అంధకారం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణ పరిధిలోని రాజానగర్‌లో గల పుట్ట సమీపంలో రెండు స్తంభాలకు వీధి లైట్లు వెలగని కారణంగా స్థానికులు, జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండటం, సమీపంలోనే పుట్ట ఉండటంతో విష సర్పాలు సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 40 రోజుల నుంచి వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు తెలియజేస్తున్నారు. వీధిలైట్లు వెలగడం లేదని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈఏపీసెట్‌లో 'జ్ఞానశ్రీ' విద్యార్థుల ప్రతిభ



జువేరియా



దయానా

మార్కాపురం టౌన్: ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో జ్ఞానశ్రీ నీట్, ఐఐటీ అకాడమీ విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావు సోమవారం తెలిపారు. ఎంపీసీ విభాగంలో బి.వెంకట సాయి రోహిత్‌రెడ్డి 2,463వ ర్యాంకు, బైపీసీ విభాగంలో షేక్ జువేరియా 1,759వ ర్యాంకు, పి.షాకీర్‌బాషా 2,623, ఎన్.దయానా 4,450, ఎన్.అంజలి 6,303, ఈ. సుబ్రహ్మణ్యం 8,213, కె.అమూల్య 9659, షేక్ మహమ్మద్ అషాద్ 15,315, డి.మహతాబ్ 15,534, జి.మాధురి 18,589వ ర్యాంకు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్, సిబ్బంది అభినందించారు.

శివాపురంలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి

మార్కాపురం టౌన్: మండలంలోని శివాపురంలో సుమారు 135 రేషనుకార్డులు ఉన్నాయని, గ్రామంలోనే దుకాణం ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. పదేళ్ల క్రితం రేషన్ షాపు ఉండేదని, అయితే ఇటీవల ఈ షాపును దేవరాజుగట్టుకు మార్చారని వివరించారు. సుమారు 2.4 కిలోమీటర్లు వెళ్లి రేషన్ తీసుకోవాలంటే మహిళలు ఇబ్బంది పడుతున్నారని గ్రామస్తుడు శ్రీనివాసరెడ్డి తదితరులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివాపురం గ్రామస్తులు

ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

బేస్తవారిపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఏపీ రైతు సంఘ నియోజకవర్గ కార్యదర్శి డాకాల పుల్లయ్య విమర్శించారు. రైతు సంఘం పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు, కౌలు రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకులలో పంట రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తామని నేటి వరకు మంజూరు చేయలేదన్నారు. రైతులందరికీ పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. ఉపాధి హామీ పనులు వ్యవసాయానికి అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి జోసఫ్, కార్యదర్శి కేవీ రమణ, నాయకులు కొండయ్య పాల్గొన్నారు.

యడవల్లిలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సైనికులు

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు.

భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల సుధాకర్‌రెడ్డి, బైర్ల దేవదాసు, మాజీ సైనికుడు అంకన్న, మార్కాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, వి.లక్ష్మీరెడ్డి, భవనం కోటేశ్వర్‌రెడ్డి, ఎస్.రామకృష్ణ, వి.రమేష్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు, అతిథులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని అమ్మవారిశాలలో గత నెల 25న ప్రారంభమైన చిన్నారుల సమ్మర్ క్యాంపు సోమవారంతో ముగిసింది. వేసవి సెలవుల్లో చిన్నారులకు యోగా, సంస్కారం, పుస్తక పఠనం, సమాజంపై అవగాహన, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై యోగా గురువు వెంకటేశ్వర్లు 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ, ప్రముఖ కవి అన్నపురెడ్డి వీరారెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ ఆర్‌కేజే నరసింహం తదితరులు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం యోగా గురువు వెంకటేశ్వర్లును సన్మానించారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు భగవద్గీతను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.